


-అందే గోపాలకృష్ణమూర్తి

రోజా రోజుకూ పెరిగిపోతూందనీ, ఈ రకమైన 'వీక్‌నెస్' ప్రజల్లో ఉండడం మూలంగా కొంతమంది దానిని 'ఎక్స్‌ప్లాయిట్' చేసి (పైడయ్య ఈ మాటని తెలుగులోనే అనుకొంటుంటాడు!)బతుకుతున్నారనీ పైడయ్య భావించాడు. అలాగే తనుకూడా మనుషుల్లో అడుగూ—బొడుగూ మిగిలిపోయి ఉన్న దయ, జాలి అనే గుణాల్ని (ఈ గుణాలు ప్రజల్లో ఇంకా కాస్త మిగిలిఉన్నవని పైడయ్య విశ్వాసం!) ఎక్స్‌ప్లాయిట్ చేసి, బ్రతుకుతెరువు సాగించవచ్చునని నిశ్చయించుకున్నాడు. గొప్పవాళ్ళ 'వీక్‌నెస్'ను ఎక్స్‌ప్లాయిట్ చేయడం పేదవాడికి చాలా కష్టతరమైన పని అని పైడయ్యకు తెలుసు. వాళ్ళని— అంటే డబ్బుతో మదించిన వాళ్ళ వీక్‌నెస్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేయాలంటే నైట్‌క్లబ్బులుండాల, సారాబుడ్లుండాల, గుడ్డలూడదీసుకుని తైతక్కలాడే దొరసానులుండాల, ఈ అన్నిటినీ నడిపించేందుకు పెట్టుబడుండాల. అప్పుడే ఆరికి నిషా, మైకం తెప్పించి, ఆ ఊపులో డబ్బు గుంజచ్చు! కానీ, 'పేదోడికి ఇవన్నీ ఎలా సాధ్యం?' అంటాడు పైడయ్య. అందుకే పేదవర్గం మీద, మధ్యతరగతి వర్గంమీద ఎటువంటివాడైనా దెబ్బ కొట్టచ్చుననే నగ్న సత్యాన్ని పైడయ్యకూడా నమ్మాడు. దేవుడి గుళ్ళో కొబ్బరికాయ కొడితే లాభాలొస్తవేమోననే ప్రలోభం, గుడి దగ్గర రంగుపూసుకు కూర్చున్న ముష్టాడికి పైసా వడేస్తే పుణ్యమొస్తుందేమో నన్న భ్రాంతీ— మనుషులలో ఈ గుణాలు రోజారోజుకీ పెరుగుతున్నందున, ఈ గుణాల నాధారంగా వాళ్లని ఎక్స్‌ప్లాయిట్ చేస్తే చాలామంది లాగా తనూ బ్రతికేయచ్చుననుకున్నాడు పైడయ్య. వడ్డీలకు డబ్బులు తిప్పుతూ హాయిగా బాదరబందీ లేకుండా బతికేస్తున్న ఎందరో ముష్టాళ్ళని చూశాడు. ఎంతమంది దానం చెయ్యకపోతే ఒక బిచ్చగాడు వంద రూపాయల వరకూ మిగిల్చి వడ్డీలకివ్వగలడు? దయ, జాలి, ధర్మం అనేవి అవతలి వ్యక్తి అనుసరించిన పద్ధతిని బట్టి మనుషుల్లోంచి వెలికి వస్తుంటాయి. ఎర్రరంగు వికృతంగా పూసుకుని కూర్చున్న జబ్బుముష్టాణ్ణి, కంటిగుడ్డు పీకేసి భయంకరంగా తయారు చేసిన పసిపిల్లల్ని చూసినప్పుడు మనుషుల్లో అడుగున పడిపోయిన జాలిగుణం వెలికి వచ్చి ధర్మగుణాన్ని రేపుతుంది. అప్పుడే మనిషి అంతో ఇంతో దానం చేస్తాడు. మనుషులకి జీవితమంటే ఎంత ప్రేమో, ప్రాణమంటే ఎంత తీపో, చావంటే అంత భయం! అందుకే 'చావు' గుర్తుకొచ్చేసరికి ఎంతటి వాడికైనా గుండె ఝల్లుమంటుంది. ఎదురుగా శవం కనబడేసరికి శరీరం గగుర్పొడుస్తుంది. ఆ గగుర్పాటులో, అనుకోకుండా ఆవహించిన ఆ భయంలో, ఆ సమయాన మనిషి భేషజాలన్నీ మరిచిపోయి, ఒక్కసారి తన గమ్యాన్ని గురించి ఆలోచించి విచలితుడైపోతాడు. అప్పుడు అతనిని ఆవహించిన భయం, ఎదుటివ్యక్తి అభ్యర్థనను లక్ష్య పెట్టేట్టు చేస్తుంది. 'ధర్మం, బాబూ!' అని వినబడితే వెంటనే ధర్మం చేసేస్తాడు— ఎంతటివాడైనా! కొందరు కర్కోటకులుంటారు. వాళ్ళు మినహా, ఈ కోవకు చెందిన వాళ్ళే అందరూ! అందుకే భయాన్ని కల్పించి, దానగుణాన్ని ఎక్స్‌ప్లాయిట్ చేయగలగడం ద్వారా తన జీవితం వెళ్లబుచ్చ వచ్చనుకున్నాడు. పైడయ్య. అందుకే మరో ముగ్గుర్ని శిష్యులుగా చేర్చుకున్నాడు. ధర్మాసుపత్రిలో దిక్కులేని శవాల్ని వాటి వివరాలను తోటివాళ్ళ ద్వారా తెలుసుకుని సంపాదిస్తాడు. నాలుగు రోడ్ల మీదా తిప్పుతాడు. నాలుగు డబ్బులు చేసుకుంటాడు. నలుగురితోనూ పంచుకుంటాడు. నలుగురి చేతా 'ఆహా, పైడయ్య ఏం సేవ చేస్తున్నాడు! దిక్కులేని శవాలకు దహనసంస్కారాలు చేస్తున్నాడు. ఎంత పుణ్యం, ఎంత పుణ్యం!...' అనిపించుకుంటాడు. 'పెట్టుబడి లేని వ్యాపారం, గొప్ప లాభాలు! దీన్లో పోలీసోడి గోడు లేదు, ఇంకంటాక్సోడు అల్లరి పెట్టడు. . ., తాసిల్దారు డవాలా బంట్రోతుకి టీ డబ్బు లిచ్చుకోక్కర్లేదు, ఎండలో కూర్చునే ఓరుపూ, గుండెలు కరిగించేలా ఏడుపూ ఉంటే చాలు, ఈ యాపారం సునాయాసంగా సాగిపోద్ది' అంటాడు పైడయ్య తన వ్యాపార—రహస్యాన్ని శిష్యులకు తెలియజెప్పుతూ.

"ఏటి, పైడయ్యమావా, ఈ విషయం పైదులు సెప్పినాడా?. . ." అడిగాడు ధర్మాసుపత్రి తోటీవాడు. "ఏం, మళ్లీ ఏదైనా శవం లేచిందేటి?" అడిగాడు పైడయ్య.

"ఆ. . . ఆడమనిసి శెవం. వయిసు నలభై. పేరు ఈరమ్మ. ఊరు పిట్టివలస . . . జబ్బు గుండె జబ్బు. . . ఆ డాట్టరు బాబు శెవాన్ని ఎనాటమీ హాలుకి పంపీమని ఏసిడ్‌లో ఏసీమంటే వేనిలా పరుగెత్తుకొచ్చిసేను. ఎంటనే ఓ ఆడమనిసినీ, పైదులుగాణ్ణి తోలుకురా . . . శెవంమీద పడి బాగా ఏడవాల. నేప్పితే డాట్టరుబాబుకి నమ్మకం కుదర్దు. ఆ గుమాస్తాగాడి కో రెండో మూడో తినిపించి. ఆడికిమూడూ, నాకు రెండూ—మొత్తం అయిదు పారేయ్. . ." అంటూ చెయ్యి జాపాడు తోటీవాడు.

"అన క్కనప్రడా-నా యాల! దీనికి ఎడ్మ న్సియ్యాలేట్. . ."


"మరొద్దేటి. . . కొత్త బొమ్మ వచ్చిందిగందా. . . మా యావిడ ఒకటే పోరు. . ." పైడయ్య దగ్గర మొత్తానికి రెండు రూపాయలు వసూలు చేసి వేగంగా వెళ్ళిపోయాడు తోటీవాడు. ఏవో లెక్కలు వేసుకొంటూ పైదులుగాడి గుడిసెవైపు బయల్దేరాడు పైడయ్య.

• • •

ఆస్పత్రినిండా ఈగలూ, రోగులూ తెగ ముసిరేస్తున్నారు. ఎక్కడ చూసినా అనారోగ్యపు కంపు, ఫినాయిల్లో కుళ్ళు కలిపిన దుర్వాసన! ఆవరణలో డాక్టరు బాబుల 'ప్లస్‌మార్కు'ల కార్లు,మోటారు సైకిళ్లు. ప్రతి వార్డు దగ్గరా గేట్‌మెన్‌లు రహస్యంగా చాపుతున్న చేతులు, వాళ్ల అదలింపులు, తోటీవాళ్ల అరుపులు, వాళ్లమీద పైవాళ్ల అజమాయిషీలు . . . నానా రభసగానూ ఉంది ఆస్పత్రి వాతావరణం!

పైడయ్య కూడా తీసుకొచ్చిన ఆడమనిషికీ, పైదులుకీ శవం చూడగానే ఎలా బావురుమనాలో, రాగాలాపన ఏ శ్రుతిలో ప్రారంభించాలో మరోసారి ఫైనల్‌గా చెప్పి, 'మార్చురీ'కీ దూరంగా తను నిలుచుండిపోయాడు.

తోటీవాడూ, గుమాస్తా గారూ జాగ్రత్తగా, చాకచక్యంగా వ్యవహారం నడిపించి, డాక్టరుబాబుగారి సమక్షంలో ఆడమనిషి శవాన్ని పైదులుకీ, ఆడమనిషికీ చూపించారు. శవాన్ని చూసీ చూడగానే లబోదిబోమని గుండెలు బాదేసుకుంటూ "అయ్యో, నా ఈరమ్మో. . . నీ కింత సిన్న వయసులోనే నూక ల్నిండిపోయిన య్యేటోనే. . . నా ఈరమ్మో. . . ఆకరి సూపుకైనా అందుకోలేక పోయానే ... అయ్యో, ఈరమ్మో. . . భగమంతుడు నన్నొగ్గేసి నిన్నట్టుకు పోనాడే. . . నేనేటి సెయ్యాలే...గుంటణ్ణొగ్గేసి మవ్వెళ్ళి పోనావేటే. . . అయ్యో, నా ఈరమ్మో . . . ఓరి పైదులుగా. . . ఈరమ్మ ఎళ్ళిపోనాదిరో. . . డాట్రుబాబూ. . . మా ఈరమ్మ ఎళ్ళిపోనాదండో. . . దిక్కులేని సావు సచ్చిపోనాదో. . . కడసూపుకైనా నోచుకోలేపోయేనో . . . అయ్యో, నా ఈరమ్మో. . . ఈరమ్మో. . ." శవంమీద పడి



రాగాలాపన ఆరంభించింది పైడయ్య కిరాయికి తెచ్చిన ఆడమనిషి.

"దాని అప్పగోరు, బాబూ. . . సిట్టివలస మండొచ్చినాది . . . సావు కబురు తెలిసినాక! పెళ్లం సచ్చిపోనాదని తెలిసి దాని మొగుడు ఎర్రెక్కిపోయి ఎటో పోనాడు. . . శవా న్నిప్పించండి బాబూ. . . సిట్టివలస నట్టుకుపోయి దహనం సేసుకుంటాం. . ." సైదులు డాట్టరుబాబుకి విన్నవించుకున్నాడు. అయోమయంలో పడ్డ డాక్టరుబాబు గుమాస్తావైపు చూశాడు. ఏదో చెప్పి డాక్టరు అర్జెంటుగా వార్డువైపు వెళ్లిపోయాడు. ఓ అరగంట పోయాక ఏడుస్తున్న ఆడమనిషికి శవాన్ని అప్పజెప్పాడు తోటీవాడు. సైదులూ, పైడయ్యా కలిసిశవాన్ని బయటకుమోసుకుపోయారు.

ఆడమనిషి శవానికి పసుపుకుంకుమలు రాశారు. పువ్వులు జల్లి, అగరొత్తులు అంటించారు. జంక్షన్ కడ్డంగా 'పాడె'ను పెట్టి ప్రాక్టీసు మొదలుపెట్టారు.

"దిక్కులేని ఆడమనిసి, బాబూ. . . సచ్చిపోనాది. . ."

"మొగుడు ఎర్రోడు, బాబూ. . . అయినా పునిస్త్రీసావు సచ్చింది. . . అదురుష్టవంతురాలు!. . . పీనుగు ఏప్పీడానికి ధరమం సెయ్యండి, బాబూ . . ."

రకరకాల కథలు చెబుతూ ఎన్నో జంక్షన్ల దగ్గర శవాన్ని ఆపి, డబ్బులు దండారు పైడయ్యా, బుచ్చిగాడూ, అప్పన్నా, సైదులూను.

ఆడమనిషి శవం అనేసరికి ఎందుకో అందరికీ జాలీ, దయాను! అందులోనూ పునిస్త్రీచావు చచ్చిందట. . .! ఎన్నడూ లేనంత 'చందా' ఆ ఆడమనిషి శవం మీద ప్రోగు చేయగలిగాడు పైడయ్య. చీకటి పడేవేళకి శవాన్ని మోసుకుంటూ పోయి కాటికాపరి కప్పగించారు— శవాల వ్యాపారంమీద జీవితం పాగిస్తున్న నలుగురు భాగస్వాములూ కలిసి!

* * *

"తెల్లారితే 'పెదవాల్తేర్లో' పోలేరమ్మ పండగ. . . సంబరానికి సినవాల్తేరూ, మద్దిలపాలెం సుట్టుపక్కల్నుంచి జెనాలు ఎగబడొత్తారు. . . ఓ శవాన్నట్టుకెళ్లి కూకున్నామంటే మా దండిగ రాల్తాయ్ డబ్బులు. . . ఏటి సేద్దాం, పైడయ్య మామా?..." అప్పన్న అడిగాడు కల్లుపాక దగ్గర మజా చేస్తున్న పైడయ్యని.

"రెల్లీథి కేసెల్లి ఓ సుట్టు ఆస్పత్రి తోటీవోణ్ని నూసిరా. రోగంతో ఉన్నోడెవడైనా రెడీగున్నాడో ఏటో ఇవరం సెప్తాడు... ఆనక శవాన్ని మోసుకుందికి పైడయ్య మామొస్తాడు. . . అందాకా అణ్ణి అలా ఒగ్గి. . . పట్టువిూదున్నాడు . . ." సైదులు అప్పన్నకి పురమాయించాడు.

ఆ రాత్రంతా ఆస్పత్రిలో ఎవడైనా దిక్కుమాలినోడు దిక్కులేని చావు చస్తాడేమోనని ఆశగా ఎదురు చూశారు పైడయ్యా, అప్పన్నా, సైదులూ, బుచ్చిగాడూను. ఎవరో గొప్పింటి ఆడమనిషి ప్రసవించలేక రాజలాంఛనాలతో చచ్చిపోయిందిగాని, ఏ పేదింటిదీ ఆ రాత్రి చావలేకపోయింది. తెల్లార్లూ కాసుక్కూచున్నారు. తెల్లారాకకూడా ఎదురు చూశారు. ఏడు, ఎనిమిది. . . పది. . . అయింది. ఎక్కడా ఏ పేదవ్యక్తిమీదా, ఏ దిక్కులేనోడిమీదా మృత్యుదేవత ఆ సమయాన కనికరం చూపలేదు. చిరాకు పుట్టుకొచ్చింది పైడయ్యకి.

"లెగండెహే. . ." అన్నాడు విసుగ్గా.

"ఈ ఏళ ఎవడి మొగం మూసేమో, ఒక్క పీనుక్కూడా దిగవేదు. . ." సైదులు గొణుక్కున్నాడు.

"తెలిసున్న డాట్టుబాబెవడైనా ఉన్నా బావుణ్ను. . . రేప్పొయ్యేవోణ్ణి ఈ ఏళకే తెమిల్చి, మన కిచ్చీసును. . ."

"పల్లకుండెహే. . . బుర్రుండాలె గాని. . . శవాలే కావాలేటి. . . మన యాపారానికి?. . ."

"నువ్వేటంటున్నావు?. . ."

"ఆc— పదండి. . . జాతరకేసి పోదారి. ఈ ఏళ్టికి శవాన్ని నేనే! ఊపిరి బిగ్గొట్టి తొంగుంటా. డబ్బుల్దండండి. . . ఆనక వాటా లేసుకుందారి సావులమదంకాడ!. . . పదండెహే . . . జెనా లొచ్చీసే టైమైపోనాది.. ." అంటూ ఉత్సాహంగా ముందుకు నడిచాడు పైడయ్య.

"తెలివంటే నీదే, మామా!" హుషారుగా లేస్తూ అన్నాడు అప్పన్న.

"ఊపిరాడినట్టు ఎవడికైనా అనుమానమేస్తే, తోలొల్చిగల్రు, జాగరత్త, గురో!"

"జెనాలు తక్కుగున్నప్పుడు ఓ బీడీ ముక్క నోటి కందించరో, సైదులుగా . . ."

"బీడీముక్కా, టీనుక్కా. . . అన్నీ నే ఏర్పాటు సేస్తాగా. . ."

* * *

"పండగపూట సచ్చిపోనాడు. . . దిక్కులేనోడు. . . ధరమం పెయ్యండి, బాబూ. . ."

"పోలేరమ్మ దయ. . . ఈ పొద్దే సచ్చిపోనాడు. . . దిక్కుమాల్నోడు. . . అదురుష్టవొంతుడు. . . తోసిం దడేయండి, బాబూ. . ."

పైసలు, పావలాలు, అర్ధలు, రూపాయలు. . . గలగలా రాలుతూనే ఉన్నాయి. ఏరుకుందుకు తీరికలేనన్ని నాణాలు. . . ఎడతెరిపి లేని జనం! శవం చుట్టూ పడుతున్న చిల్లరను గుట్టగా పోగు చేస్తూ మళ్లీ 'అరుపు' ప్రారంభించే వాళ్లు అప్పన్నా, సైదులూ, బుచ్చిగాడూ.

ఆపు లేకుండా పడుతున్న డబ్బును చూసి ముగ్గురి కళ్లలోనూ వింతకాంతి మెరిసింది. తండోపతండాలుగా ప్రజలు వస్తూనే ఉన్నారు. డబ్బులు రాలుతూనే ఉన్నాయి. వీలైనప్పుడల్లా సీసా తీసి గుక్కెడు మింగుతూనే ఉన్నారు— ముగ్గురూ కలిసి. సాయంత్రం ఆరు, ఏడు, ఎనిమిది. . . దాటిపోయింది. ఇంకా జనం వస్తూనే ఉన్నారు. పావలా, అర్ధా పడుతూనే ఉన్నాయి.

"పైడయ్యమామదిగొప్పబుర్రలే!" ఆ హడావుడిలోనూ సైదులు చెవిలో మెల్లగా అన్నాడు అప్పన్న, ఇంకో గుక్కెడు పట్టిస్తూ. "బుర్రకి బుర్ర . . . నటనకి నటన. . ., సినేమా యాట్టరుబాబు! ఊపిరి బిగ్గొట్టి శవంలా తొంగోవాలంటే మాటలా? సినీవోడు సెయ్యగల్డా, నాటకాలోడు సెయ్యగల్డా. . .? ఈ డబ్బులో సగం వాటా పైడయ్య మామ కిచ్చీసినా మనం ముగ్గురూ నెల్లాళ్లు సీకూ సింతా నేకండా దజ్జాగా బతికీయచ్చు. . ." అంటూ సీసా ఖాళీ చేశాడు సైదులు.

"తొమ్మిది కొట్టేట్టుంది. . . శవాన్ని మోసుకుంటూ పోదారేటి. . . జెనాల్లేకండా సూసి పైడయ్య మామని దింపేద్దారి. . ."

"నడండెహే. . ." అంటూ పాడె మీద కెక్కించారు పైడయ్యని. శవాన్ని చూసి జాలిపడుతున్న జనం ఇంకా అణా, పరకా వేస్తూనే ఉన్నారు.

"గోవిందా. . . గోహో. . . వింద" అంటూ శవాన్ని లేపారు.

"దిక్కులేనోడి పీనుగు, బాబూ. . . పండగపూట పోయేడు. . ."

అప్పన్నా, సైదులూ పాడెను మోస్తుంటే, ముందు నడుస్తూ ఇంకా డబ్బులు దండుతూనే ఉన్నాడు బుచ్చిగాడు.

రోడ్లన్నీ జనమయం. ఎక్కడా శవాన్ని దింపి పైడయ్యకి దమ్ము కొట్టిద్దామంటే వీలుపట్టం లేదు. . . అలాగే మోసుకుంటూ పోతున్నారు అప్పన్నా, సైదులూను.

ఎల్లమ్మతోట, అల్లిపురం. . . అన్ని జంక్షన్లూ దాటి 'చావులమదం బ్రిడ్జి' దగ్గర కొచ్చారు. జన సంచారం తగ్గింది. ఒకటో, రెండో రిక్షావాళ్లు బేరాల్లేక అలా కూచుని కునుకుపాట్లు పడుతున్నారు.



పాపం!

చిత్రం— వి. ఆగాచార్య
(కరీంనగర్)

"ఏం శ్రమ పడ్డావ్, మామా! పోతేపోన్లే... మా గొప్ప కలెక్షన్లొచ్చియ్!"

"దిగు దిగెహే. . . జబ్బంతా పట్టేసినాది. . ." అంటూ పాడెను దింపాడు అప్పన్న. బుచ్చిగాడు సాయం చేశాడు.

"దిగు, గురో. . ." అంటూ దుప్పటి తీశాడు బుచ్చిగాడు.

పైడయ్య మరి దిగలేదు.

బతికున్నోళ్లకి దిక్కులేని శవాల్ని చూపి, డబ్బు దండి దర్జాగా బతికిన పైడయ్య దిక్కులేని శవంగా మారిపోయి ఆ పాడెను మరిక దిగలేదు!

* * *

"దిక్కులేని శవాల్ని మోసుకెళ్లి కాల్చే పైడయ్య, బాబూ... దిక్కుమాల్నసావు సచ్చిపోనాడు... తోసిని కాడికి పడేయండి బాబూ. . ."

"నాన్నగోరు... నాన్నగోరు ... ఎన్నో శవాల్ని కాల్చేవోడు, బాబూ . . . ఈడి పీనుక్కి దిక్కూ మొక్కూ లేపోవాది .. దయసూపండి, బాబూ . . ."

ఆస్పత్రి జంక్షన్లో పైడయ్య శవాన్ని పడుకోబెట్టి సైదులూ, అప్పన్నా, బుచ్చిగాడూ హుషారుగా డబ్బులు దండుతూనే ఉన్నారు. ★